

# జోరుగా పీడీఎస్ బియ్యం దందా

నర్సింహులపేట, జనవరి 11 : జిల్లాలో రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, సిండికేట్‌గా ఏర్పడి కొందరు వ్యాపారులు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. వాటిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ పోర్టుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నాయి.

కొందరు వ్యాపారులు ఎఫ్ఎస్‌సీ కార్డుదారుల నుంచి, రేషన్ డీలర్ల నుంచి తక్కువ ధరలకు బియ్యం కొనుగోలు చేస్తున్నారు. పీడీఎస్ అధికధరకు ఇతర రాష్ట్రాలకు అక్రమంగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాలలో 557 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 2,24,818 తెల్ల రేషన్ కార్డులు, 15,553 అంత్యోదయ కార్డులు, 2 అన్నపూర్ణ కార్డులకుగాను నెలనెలా 7,059 టన్నుల బియ్యం సరఫరా అవుతోంది.కార్డు లబ్ధిదారులకు ఈ బియ్యాన్ని రూపాయకే ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. కాగా, తొర్రూరుసబ్‌డివిజన్‌లోని సీరోలు, మరిపెడ, తొర్రూరు, ఉమ్మడి నర్సింహులపేట మండలాలతో పాటు పెద్ద గూడూరు, కొత్తగూడ, కేసముద్రం, గార్ల, కురవి, నెల్లికుదురు మండలాల్లో ఈరేషన్ బియ్యం దందా అధికంగా కొనసాగుతోంది.

**ఊరి చివర ఉన్న ఇళ్లే అడ్డాలు..**

జిల్లాలో పీడీఎస్ బియ్యం దందా కొనసాగుతోంది. అక్రమ రవాణాదారులు సిండికేటుగా ఏర్పడి, రేషన్ బియ్యాన్ని ద్విచక్రవాహనాలు, ఆటోలు, టాటాఏసీ వాహనాలల్లో బియ్యం బస్తాలను తీసుకువచ్చి.. పాత రైస్‌మిల్లులు, రోడ్డు సౌకర్యం ఉండి ఊరు చివరన ఉన్న ఇళ్లలో అడ్డాలుగా ఏర్పాటు చేసుకుని, డంప్ చేస్తారు. భారీ మొత్తంలో జమచేసిన తర్వాత రాత్రి సమయాలల్లో టర్బో లారీల్లో కాకినాడ పోర్టుకు అక్రమంగా తరలిస్తున్నారు. అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలుతున్నాయి.

**కిలో రూ.8 కొనుగోలు చేసి..**

జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాలల్లో కొందరు సిండికేటుగా ఏర్పడి రేషన్ బియ్యాన్ని రూ.5 నుంచి రూ. 8కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు కాకినాడ పోర్టుకు రూ.15 నుంచి రూ. 18లకు అధిక ధరలకు అక్రమంగా తరలిస్తున్నారు. బ్లాక్ మార్కెట్ వ్యాపారులకు కొందరు రేషన్ డీలర్ల మద్దతు ఉండడం వల్లనే భారీ స్థాయిలో పీడీఎస్ బియ్యం ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



ద్విచక్రవాహనంపై పీడీఎస్ బియ్యం తరలిస్తున్న దృశ్యం (ఫైల్)



నర్సింహులపేటలో అక్రమంగా డంప్ చేసిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న అప్పటి తొర్రూరు డీఎస్పీ రాజరత్నం (ఫైల్)



నర్సింహులపేట నుంచి ఆటోలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యం (ఫైల్)

- గ్రామాల్లో కిలో రూ.8 కొనుగోలు చేసి, అధిక ధరకు అమ్ముతున్న వ్యాపారులు
- రైస్‌ను మానుకోట టు కాకినాడ పోర్టుకు తరలింపు.. అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు..
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 557 రేషన్ దుకాణాలు

**అధికారులకు సవాల్‌గా..**

పీడీఎస్ అక్రమ దందా సంబంధిత అధికారులకు సవాల్‌గా మారుతోంది. నిలువరించేందుకు అధికారులు నిఘా ఏర్పాటు చేస్తున్నప్పటికీ వారి కంట్లో పడకుండా ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ఈ అక్రమ దందాను కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇటీవల నర్సింహులపేట మండలంలోని కొమ్ముల వంచలో ఓ వ్యాపారి పాత ఇంటిలో 15 క్వింటాల రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారనే సమాచారంతో ఆ ఇంటిపై స్థానిక ఎస్సై సతీష్ దాడి చేసి, బియ్యాన్ని సీజ్ చేశారు. గత నవంబరు మాసంలో మరిపెడ మండలంలోని పురుషోత్తాయగూడెంలో పోలీసులు 25 క్వింటాల బియ్యాన్ని సీజ్ చేశారు. పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉన్నప్పటికీ అక్రమ బియ్యం దందా మాత్రం ఆగడం లేదని పలువురు తెలుపుతున్నారు.



**ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..**

- జి.నర్సింహా, ఆర్డీవో తొర్రూరు

డీలర్లు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినా, విక్రయించినా సహించేది లేదు. ఫిర్యాదు చేస్తే 6ఏ కేసు నమోదు చేసి, పీడీయాక్టు కేసు నమోదు చేస్తాం. ప్రభుత్వం నెలనెలా సరఫరా చేస్తున్న పీడీఎస్ బియ్యం ప్రజలకే అందేలా చర్యలు తీసుకుంటాం..

### ఏటా రూ.6 కోట్ల నుంచి రూ.8 కోట్ల వ్యాపారం

రేషన్ బియ్యం దందాల్లో రూ.లక్షల్లో చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏడువందల పైచిలుకు టన్నుల పీడీఎస్ బియ్యం కిలో రూపాయి చొప్పున ప్రభుత్వం సరఫరా చేస్తోంది. దీనిని ఆసరా చేసుకున్న కొందరు కొనుగోలు చేసి, రూ. 5నుంచి రూ.8 కొనుగోలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సిండికేట్ వ్యాపారులు ఇరత రాష్ట్రాలకు బియ్యం రూ.18 కేజీ చొప్పున బియ్యం అక్రమంగా తరలిస్తూ.. ఏటా రూ. 6.కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు లావాదేవీలు జరుతుతున్నట్లు సమాచారం.



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

# ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జనవరి11 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకునేందుకు అఖిలపక్ష పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని గురువారం గ్రాడ్యుయేట్ ఓటర్లు ఓటుహక్కు నమోదుపై అఖిలపక్ష పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ షెడ్యూల్ రానున్నందున 1 నవంబరు 2023 నాటికి మూడు సంవత్సరాల గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు ఓటుహక్కు నమోదుకు అర్హులని చెప్పారు. ఫారం-18 ద్వారా లేదా ఆన్‌లైన్ ద్వారా ఓటుహక్కు నమోదు చేసుకోవచ్చన్నారు. ఫారం-18 దరఖాస్తులను స్వీకరించేందుకు ఈ నెల 20న శనివారం, 21న ఆదివారం ఆయా పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఫిబ్రవరి 6 వరకు దరఖాస్తులు అందించవచ్చన్నారు. అదే విధంగా 1 జనవరి 2024 వరకు 18 ఏళ్లు నిండిన వారు ఫారం- 6 ద్వారా ఓటుహక్కు పొందవచ్చన్నారు. ఫారం-7 ద్వారా తొలగింపులు ఉంటాయని, ఫారం-8ద్వారా మార్పులు, సవరింపులు చేయడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 21న ఓటరు జాబితా ముద్రణ చేపడుతామని, 24న ప్రచురిస్తామన్నారు. 24వ తేదీ నుంచి మార్చి 14 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు అందించవచ్చన్నారు. సవరించిన జాబితాను మార్చి 29న సిద్ధం చేస్తామని, ఏప్రిల్ 4న ఫైనల్ ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు రాజమౌళి, శ్రీనివాస్, సురేష్‌నాయుడు, ఉపేందర్, ఎల్ది మల్లయ్య, రాంచందర్‌రావు, విజయసారథి పాల్గొన్నారు.

**సీఎంఆర్ రైస్ అందించకుంటే మిల్లర్లపై చర్యలు..**

వానాకాలం, యాసంగి పంట ధాన్యాన్ని మిల్లర్లు మర పట్టించి, నిర్ణీత గడువులోగా సీఎంఆర్ రైస్ అందించకపోతే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయంలో సీఎంఆర్ రైస్ లక్ష్యాలపై రైస్ మిల్లర్లతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. రైస్ మిల్లుల వారీగా కేటాయించిన లక్ష్యాలను అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని నిర్ణీత వ్యవధిలోగా నిర్దేశించిన ధాన్యాన్ని మిల్లర్లు మరపట్టించి, బియ్యంగా మార్చి ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు రోజువారీ లక్ష్యా లను ఇస్తూ నివేదిక ఇవ్వాలన్నారు. అదే విధంగా మిల్లర్స్ ధాన్యం మర పట్టించడం విషయంలో అలసత్వం వహించకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, పర్యవేక్షణ చేయాలన్నారు. రోజువారీ లక్ష్యాలను సాధించాలన్నారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ మేనేజర్ కృష్ణవేణి, పౌరసరఫరాలశాఖ అధికారి రాజేందర్ పాల్గొన్నారు.

## 'అధికారులు పూర్తి అవగాహనతో ఉండాలి'

మహబూబాబాద్ టౌన్, జనవరి 11 : ఆదాయపన్ను చెల్లింపుల విషయంలో అధికారులు, ఉద్యోగులు కేంద్రప్రభుత్వ నియమనిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కేంద్రప్రభుత్వ ఆదాయ పన్నుశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారులు సునిల్‌మిశ్రా, మాధవి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం కేంద్రప్రభుత్వ ఆదాయ పన్నుశాఖ ఆధ్వర్యంలో అధికారులకు ఆదాయపన్నుల చెల్లింపు, త్రైమాసిక, వార్షిక రిటర్న్ దాఖలుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అధికారుల పాటించాల్సిన నియమాలు, తీసుకో వాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అధికారులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులంతా ఆదాయ పన్ను చెల్లింపుల్లో సమగ్ర అవగాహన ఉండాలని సూచించారు. జిల్లా అధికారులు రమాదేవి, నాగన్న, సుబ్బారావు, వెంకటరమణ పాల్గొన్నారు.



ఆదాయ పన్నుల చెల్లింపుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న మాధవి

## మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ సమీక్షకు బీఆర్ఎస్ నేతలు



తెలంగాణ భవన్‌లో సమావేశానికి హాజరైన ఎంపీ కవిత, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, రెడ్యానాయక్

మహబూబాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమీక్షా సమావేశానికి జిల్లా నేతలు హాజరయ్యారు. ఎంపీ మాలోతు కవిత, జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్, డోర్నకల్, మానుకోట మాజీ ఎమ్మెల్యేలు డీఎస్. రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, మునిసిపల్ వైస్ చైర్మన్ ఎండి.ఫరీద్, బానోత్ రవి కుమార్, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, కేఎస్ఎన్.రెడ్డి, మర్రి రంగారావు, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, యాళ్ల మురళీధర్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ ముఖ్యనాయకులు హాజరయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గంలో గులాబీ జెండాను ఎగురవేయాలని సూచించినట్లు పార్టీల శ్రేణులు తెలిపారు.

# ఇళ్లు లేని నిరుపేదలపై వివక్ష ఎందుకు

- మానుకోటలో 19 సార్లు గుడిసెలు కూల్చివేత
- పట్టాలిచ్చేంత వరకు పోరాటాలు ఆగవు
- భూ కబ్జాలపై విచారణ జరపాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుంకరి వీరయ్య



గుడిసె వాసుల ధర్నాలో మాట్లాడుతున్న సుంకరి వీరయ్య

మహబూబాబాద్ టౌన్, జనవరి 11 : ఇళ్లులేని నిరుపేదలపై అధికారులు ఎందుకు కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని, వారిపై ఎందుకంత వివక్ష చూపుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుంకరి వీరయ్య ప్రశ్నించారు. నిరుపేదలకు ఇంటి స్థలాలివ్వాలని, ప్రభుత్వ భూముల్లో ఉంటున్నపేదలకు పట్టాలిచ్చి ఇల్లు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. ముందుగా సీపీఎం పార్టీ కార్యాలయం నుంచి తహసీల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ గత పాలకుల చేతిలో ఉన్న అధికారులు, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ చేతులు కలిపి భూముల కబ్జాకు సహకరిస్తున్నారని ఆరోపించారు. వందలాది ఎకరాలు కబ్జాకు గురైతే పట్టించుకోని అధికారులు పేదలు గుడిసెలు వేసుకుంటే కూల్చాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని నిలదీశారు. తెలంగాణలోని 19 జిల్లాలో సుమారు లక్ష కుటుంబాలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటే. రాష్ట్ర చరిత్రలో ఎక్కడా, ఎన్నడూలేని విధంగా మానుకోటలో 19సార్లు కూల్చివేశారని మండి పడ్డారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వివరించామని.. వారు పట్టాలివ్వడానికి సుముఖంగా ఉంటే స్థానిక అధికారులు గుడిసెలు కూల్చివేతకు ఎందుకు అత్యుత్సాహం చూపుతున్నారో అర్థం కావడం లేదన్నారు. అధికారుల తప్పుడు నిర్ణయాల వల్ల ఈరోజు ధర్నాకు దిగాల్సి వచ్చిందన్నారు. మానుకోటలో భూ కబ్జాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య, నాయ కులు ఆకుల రాజు, గునిగంటి రాజన్న,అల్వాల వీరయ్య, శ్రీని వాస్, రాజమౌళి, మహేష్, రాంమూర్తి, ఉపేందర్, సైదులు, యాకయ్య, రాజు, నాగన్న, శ్రీనివాస్, వెంకన్న, హేమానాయక్, భాగ్యలక్ష్మి పేదలు పాల్గొన్నారు.

**పేదల జోలికి వస్తే గుణపాఠం తప్పదు..**

- సీపీఎం నేత నాగయ్య

పేదల జోలికి వచ్చిన ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాధించలేదని, పేదల ఇళ్లను కూల్చిన బీఆర్ఎస్ సర్కార్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పి, గద్దెదించారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య అన్నారు. పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవాలని, పేదల గుడిసెలకు పట్టాలిచ్చేంత వరకు పోరాటాలు ఆగవని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ భగవాన్ రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు.

## మొదలైన 'రైతుబంధు'

- ఇప్పటి వరకు 1,02,839 మందికి లబ్ధి

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 11 : గత కొద్దిరోజుల క్రితం నిలిచిన రైతుబంధు పథకంలో మళ్లీ కదలికలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో బుధవారం రాత్రి వరకు రెండెకరాల వరకు ఉన్న రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు విడతల వారీగా పడుతున్నట్లు జిల్లా వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గతంలో ఎకరం వరకు పడి రైతుబంధు ఆగిపోగా, ప్రస్తుతం మళ్లీ మొదలైంది. జిల్లాలో 2,14,685 మంది రైతులు ఉండగా, వారికి రూ.233.07 కోట్ల నిధులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు 1,02,839 మంది రైతులకుగాను రూ.46.19 కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయి.

## వాహనాల వేలం ద్వారా రూ.17.06 లక్షల ఆదాయం

గూడూరు, జనవరి 11 : గూడూరు ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 40 వాహనాలకు నిర్వహించిన వేలం పాటద్వారా రూ.17.06 లక్షల ఆదాయం వచ్చినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కిరణ్ గురువారం తెలిపారు. మొత్తం 40 వాహనాలకు వేలంపాట నిర్వహించగా, అందులో 27 వాహనాల కొనుగోలు ద్వారా రూ.17,06,190 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. మిగిలిన వాహనాలకు సైతం త్వరలోనే వేలంపాట నిర్వహిస్తామని వివరించారు. గూడూరు, నర్సంపేట, భూపాలపల్లి, మహబూబాబాద్ ప్రాంతాల నుంచి సుమారు వందమందికి పైగా వేలం పాటలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బిక్షపతి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో జనగామ డీఎంహెచ్‌వో

- ఔట్‌సోర్సింగ్ ఫార్మసిస్ట్‌కు లంచం వేధింపులు
- రూ. 50 వేలు టేబుల్ డ్రాలో పెట్టిన బాధితురాలు
- పక్కాప్లాన్‌తో పట్టుకున్న ఏసీబీ అధికారులు
- సహకరించిన జూనియర్ అసిస్టెంట్ అరెస్టు
- కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఘటన



డీఎంహెచ్‌వో ప్రశాంత్‌ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

జనగామ టౌన్, జనవరి 11: జనగామ జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ చేపూరి ప్రశాంత్ గురువారం ఏసీబీ వలలో చిక్కుకున్నారు. ఓ ఫార్మసిస్ట్ వద్ద లంచం పుచ్చుకుని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. జనగామ కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. డీఎంహెచ్‌వోతో పాటు జూనియర్ అసిస్టెంట్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాలు... జనగామ మండలం యశ్వంతాపూర్ గ్రామానికి చెందిన స్రవంతి అనే యువతి 2021 నుంచి ఓబుల్‌కేశ్వాపూర్ ప్రాథమిక వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ కింద ఫార్మసిస్ట్‌గా పనిచేస్తోంది. పర్మనెంట్ ఉద్యోగి వచ్చారనే సాకు చూపించి ఆమెను 2023 అక్టోబర్‌లో తొలగించారు. అదే రోజు సాయంత్రం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఆమెకు జూనియర్ అసిస్టెంట్ అజహార్ ఫోన్ చేశారు. తిరిగి ఉద్యోగం కావాలంటే డీఎంహెచ్‌వో కార్యాలయంలో కలవాలని సూచించారు. ఆమె డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లగా, ఉద్యోగం కావాలంటే రూ.లక్ష ఇవ్వాలని చెప్పారు. తాను అంత ఇచ్చుకోలేనని డీఎంహెచ్‌వో ప్రశాంత్‌కు తెలిపింది. రూ.50వేల వరకు ఇస్తానని విన్నవించుకుంది. ఈ క్రమంలో వారం కిందట రూ.50 వేలు చెల్లించింది. అయినా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో ఆమె డీఎంహెచ్‌వోను ప్రశ్నించింది. మరో రూ.50వేలు ఇవ్వాల్సిందేనని జూనియర్ అసిస్టెంట్ ద్వారా డీఎంహెచ్‌వో చెప్పారు. ఈ క్రమంలో బాధితురాలు ఏసీబీ అధికారులను సంప్రదించింది. వారి డైరెక్షన్‌లో రూ.50వేల నగదు తీసుకుని గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లింది. డీఎంహెచ్‌వో, జూనియర్ అసిస్టెంట్ సూచన మేరకు ఆ డబ్బులను కార్యాలయంలోని ఓ టేబుల్‌లో పెట్టింది. ఈ క్రమంలో అక్కడే మాటువేసి వున్న ఏసీబీ అధికారులు డీఎంహెచ్‌వో కార్యాలయంలోకి వెళ్లి డీఎంహెచ్‌వోతో పాటు జూనియర్ అసిస్టెంట్‌ను అదుపులోకి తీసుకున్నారు. లంచం డిమాండ్ చేసినట్లు విచారణలో ఒప్పుకోవడంతో ఇద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు శ్యాంసుందర్, కె.శ్రీను, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా పని చేయాలి

- ఆరు గ్యారెంటీల అమలుకు ప్రత్యేక ప్రణాళిక
- ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

నర్సింహులపేట, జనవరి 11 : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని, ఆరు గ్యారెంటీల అమలుకు ప్రత్యేక ప్రణాళికతో ముదుకు సాగాలని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ టేకుల సుశీల అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వ్యవసాయ, ఇరిగేషన్, పశుసంవర్ధకశాఖ, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, విద్యుత్, విద్యా, వైద్యం, మిషన్‌భగీరథ, ఐటీడీఏ శాఖలపై సంబంధిత అధికారులు వివరాలు వెల్లడించారు. ఇరిగేషన్, పీఆర్, మిషన్ భగీరథ, ఐసీడీఎస్ అధికారుల తీరుపట్ల సభ్యులు ప్రశ్నించగా.. స్పందించిన ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్‌లో పదేళ్ల నుంచి సమస్యలను సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్తున్నా.. పరిష్కారం నేటికి దొరకలేదని డీఈ రాజ్‌కుమార్‌ను తీవ్రంగా మందలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డోర్నకల్ నియోజకవర్గంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయంగా వ్యవహరిస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికి పని చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ భూక్యా సంగీత, ఎంపీడీవో భారతి, తహసీల్దార్ వివేక్, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలి**

గ్రామాల్లో ఆరు గ్యారెంటీల అమలుకు గ్రామస్థాయిలో 5 నుంచి 7 మందికి మించకుండా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని స్థానిక వెంకటేశ్వర గార్డెన్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జినుకల రమేష్, విద్యావంతుల ఐక్యవేదిక కన్వీనర్ డోలి సత్యనారాయణ, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## నేటి నుంచి స్కూళ్లకు సంక్రాంతి సెలవులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 11 : అన్ని ప్రభుత్వ యాజమాన్య, ప్రైవేటు పాఠశాలలకు ఈనెల 12వ తేదీ నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సంక్రాంతి సెలవుల సమయంలో తరగతులు నిర్వహించకూడదన్నారు. కాగా, హాస్టళ్లలో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను తలిదండ్రులు హాస్టళ్లకు చేరుకొని తమ స్వగ్రామాలకు తీసుకువెళ్లారు. కొంతమంది తల్లిదండ్రులు ద్విచక్రవాహనాలు, ఆటోల్లో తమ పిల్లలను తీసుకువెళ్లగా మరి కొంతమంది విద్యార్థులు ఆర్టీసీబస్సుల్లో వెళ్లారు. దీంతో మానుకోట ఆర్టీసీ బస్టాండ్ విద్యార్థులతో కిక్కిరిసి పోయింది.



మానుకోట బస్టాండ్ నుంచి సొంత ఊళ్లకు వెళ్లేందుకు బస్సులో కూర్చున్న విద్యార్థులు

# ఇంటర్ విద్యార్థులకు సువర్ణావకాశం

● గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

● ఈ నెల 15వ తేదీ వరకు గడువు

హనుమకొండ రూరల్, జనవరి 11: ఎస్సీ గురుకులాలు పేద విద్యార్థులకు వరంగా మారాయి. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నాయి. గురుకులాల్లో ఏర్పాటు చేసిన ప్రతిభ కళాశాలలు (కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్) అసాధారణ ఫలితాలు సాధిస్తున్నాయి. ఈ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రతిష్ఠాత్మకమైన జాతీయస్థాయి ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధిస్తూ బంగారు భవితకు బాటలు వేసుకుంటున్నారు. ఐఐటీ, నీట్‌లో ఈ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలకు కలిసి మడికొండలో బాలురకు 1, బాలికలకు 1 కళాశాల ఉంది. ఇందులో బైపీసీ 40, ఎంపీసీ 40 సీట్లు చొప్పున ఉన్నాయి. విద్యార్థులకు నచ్చినరంగాల్లో శిక్షణ ఇప్పిస్తూ వారిలోని సృజనాత్మకతను వెలికితీస్తున్నారు. చదువుతోపాటు క్రీడల్లో గురుకుల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయనున్నారు.

**ఈ నెల 15వ తేదీ వరకు గడువు**

ప్రస్తుత విద్యాసంవత్సరం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 15వ తేదీలోగా www.tswreis.ac.in, www.tsswreisjc.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల కోసం తమకు ఇష్టమైన కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్ మాధ్యమంలో విద్యాబోధన ఉంటుంది. సీఈవో కళాశాలల్లో ఇంటర్మీడియేట్ తరగతులతోపాటు ఐఐటీ, ఎన్ఐటీ, నీట్, క్లాట్, సీఎంఏ తదితర పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇస్తారు. నాణ్యమైన విద్యతోపాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు. ప్రవేశ పరీక్ష బహుళ ఐచ్ఛిక పద్ధతిలో తెలుగు, ఇంగ్లీషులో ఉంటుంది. ఫిబ్రవరి 4వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. అందులో మెరిట్ సాధించిన అభ్యర్థుల్లో 1:5 నిష్పత్తిలో రెండో స్క్రీనింగ్ పరీక్షకు ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులను రెండో విడతలో ఫిబ్రవరి 25న ఎంపిక చేసిన సెంటర్లలోనే 150 మార్కులకు మళ్లీ పరీక్ష నిర్వహిస్తారు. ఎస్సీలకు 75శాతం, బీసీలకు 12శాతం, ఎస్టీలకు 6శాతం, మైనార్టీలకు 3శాతం, ఇతరులకు మిగిలిన సీట్లు కేటాయించి ఆ మేరకు మెరిట్ జాబితాను ప్రకటించి ప్రవేశాలు కల్పిస్తారు.

## ప్రతిభ ఆధారంగానే ఎంపిక

**ఎస్.విద్యారాణి, ప్రాంతీయ సమన్వయ అధికారి వరంగల్ రీజియన్**



ప్రతిభా కళాశాలలు అద్భుత విజయాలు, అనితర సాధ్యమైన ప్రతిభాపాటవాలకు చిరునామాగా నిలుస్తున్నాయి. అట్టడుగువర్గాల్లోని పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు అత్యున్నత స్థాయికి వెళ్లేందుకు గురుకులాలు బాటలు వేస్తున్నాయి. ఉచిత విద్యను అందించడంతోపాటు నిరుపేద విద్యార్థులు పైసా ఖర్చు లేకుండా ఐఐటీ, నీట్‌లాంటి జాతీయ పోటీపరీక్షల్లో కార్పొరేట్‌కు దీటుగా లాంగ్ టర్మ్ కోచింగ్ అందిస్తాం. గడువులోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ప్రతిభ ఆధారంగానే ఎంపిక చేసి ప్రవేశాలు కల్పిస్తాం.

# అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

కమలాపూర్, జనవరి 11: మండలంలోని మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన సదువాల రమ(45) అనే మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్టు గురువారం పోలీసు ఇన్‌స్పెక్టర్ బొలిమల్ల సంజీవ్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని భాగిర్థిపేట గ్రామానికి చెందిన రమతో మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన సదువాల స్వామికి 25 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. స్వామి ట్రాక్టర్ డ్రైవర్‌గా, రమ వ్యవసాయ కూలి పనిచేసి జీవనం గడుపుతున్నారు.

కాగా, గురువారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన రమ కనిపించకుండా పోయింది సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ బావి వద్ద చెప్పులు, దుప్పటి గ్రామస్థులకు కనిపించాయి. దీంతో వారి కుటుంబ సభ్యులకు తెలుపగా వెంటనే అక్కడికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో మహిళ మృతదేహాన్ని బావిలోంచి బయటకు తీశారు. మృతురాలి సోదరుడు బొమిక సౌందరయ్య ఫిర్యాదు మేరకు రమది అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# కారు పల్టీ - తప్పిన ప్రమాదం

ఐనవోలు, జనవరి 11: కారు అదుపుతప్పి పంట పొలాల్లో పడి పోయిన సంఘటన పున్నేలు క్రాస్‌రోడ్డు జాతీయరహదారిపై గురువారం రాత్రి జరిగింది. ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం గోవర్ధనగిరికి చెందిన రషీద్ వరంగల్ నుంచి పంథిని వైపు కారులో వెళ్తున్నాడు. క్రాస్ రోడ్డు దాటాక కారు అతి వేగంగా కుడివైపు రోడ్డును దాటి ఆర్ అండ్‌బీ సూచికల బోర్డును ఢీకొట్టి 150 అడుగుల దూరంలో ఉన్న మొక్కజొన్న పంటచేనులో పడిపోయింది. కారులో డ్రైవర్ ఒక్కరే ఉన్నారు. కారు బెల్టు ధరించడం వలన స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కారు కుడివైపున దూసుకపోయిన సమయంలో మరే వాహనం ఎదురుగా రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పినట్లయింది.

# మోగిన ఐలోని మల్లన్న డోలు

జాతరకు ముస్తాబైన ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం

విభిన్న పద్ధతుల మిళితం.. జానపదుల జాతరగా ప్రాశస్త్యం

రాణి రుద్రమదేవి సైతం సంతానప్రాప్తికి పూజలు



'సకం భాగ్యాలు కలిగి... సంతోషమాత భక్తి కలిగి... అవులు గోవులు కలిగి... అవాలక్ష కావాల్లు కలిగి... ముట్టింది ముచ్చమై పట్టింది బంగారమెమ్మై.. పాలి వాడు దగ్గరై పగవాడు దూరమై.. ఏటికి ఎడ్లు కలిగి పాటికి బర్లు కలిగి... పర్వ తాల మల్లయ్యా.. మా పాలి కలిగి ఉండి... పతి పార్వతిలా కొలిమే" అంటూ ఒగ్గు పూజారులు ధమురుకాల శబ్దాల నడుమ కొలువనుండగా మల్లన్న జాతర వైభవంగా జరగనుంది. ఈ జాతర జానపదుల జాతరగా ప్రాచుర్యం పొందింది. మకర సంక్రమణతో ప్రారంభమయ్యే జాతర ఉగాది వరకు సాగనుంది. కాకతీయుల కాలంలో మొదలైన ఈ క్రమం.. కాలాలు మారినా దినదినం ఇంకా వెలుగొందుతూనే ఉంది. మరో మూడు రోజుల్లో మొదలయ్యే ఈ జాతరలో భక్తులు ఆచరించే తంతుపై ప్రత్యేక కథనం..



ఐనవోలు, జనవరి 11: ఐనవోలు మల్లికార్జునస్వామి(మల్లన్న) జాతర భక్తులకు ఎంతో ప్రాశస్త్యమైనది. పూర్వ కాలంలో జానపదుల జాతరగా కీర్తి గడించి, శైవారాధన పూజలు అందుకుంది. 1100 యేళ్ల కిందట కోరమీసాల మల్లన్న కొలువయ్యాడని భక్తుల విశ్వాసం. విభిన్న శైవాగామ పద్ధతుల్లో నిత్యపూజలు అందుకునే మల్లన్న స్వామి ఒక చేతిలో ఖడ్గం మరోచేతిలో త్రిశూలం ధమురకం తలపై కిరీటం మూతిపై మీసం ఒక ప్రత్యేకతగా దర్శనమిస్తాడు. నిర్వికారి నిరహంకార నిరాకారస్థితి లింగస్వరూపంలో మూలవిరాట్ అర్ధప్రానపట్టం శ్వేత వర్ణము కలిగి ఉండటం ఇక్కడ మరో విశేషంగా భావిస్తారు. ఖండోబ అవతారంలో స్వామి వారికి భార్యలు కుడిపక్క గొల్ల కేతమ్మ ఎడమ పక్కన బలిజ మెడమ్మలు కొలువయ్యారు. ప్రతీ రోజు శైవాగమ పద్ధతినను సరించి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ముఖ్య పూజల్లో భక్తులు బోనాలు, పట్నాలతో నైవేద్యం సమర్పిస్తారు.

### చెలుక, నజరు పట్నం.. పెద్దపట్నం..

మొక్కులతో ఆలయానికి వచ్చే భక్తులు ముందుగా ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించుకొని మొక్కులు చెల్లించాకే స్వామి వారిని దర్శించుకుంటారు. బండారి పలుకపై తెల్లపిండి పసుపు కనుగోల్లు దోశెడు బియ్యం పోసి మైలపోలు తీస్తారు. కుడుక, పోక, ఖర్జూర, పసుపు గౌరవమ్మను పెట్టి రైక మలపు తెల్లతువ్వాల పెట్టి మైల పోలు తీశాక తంగడిపచ్చతో చల్లి తెల్లపిండిలో పలుక కోట్టి పట్నం(పటం) వేసి మల్లన్న కథలు చెప్పుతారు. శరణు మల్లేశా.. అంటూ పాటలోనే కల్యాణం చేసి పట్నం మీద అక్షింతలు వేస్తారు. ఒక్కపొద్దు విడిచి స్వామి వారిని దర్శించుకుంటారు. పెద్దపట్నం వేసి స్వామి కథను చెప్పుతారు. జానపదుల అవాహనాల్లో పట్నం అంటే ఆసనం రూపకంలో శివుడిని ఆహ్వానించడం అన్నమాట. స్వామివారికి ఉదయం మేలుకొలుపు, రాత్రి పవలింపు ఒగ్గు పూజారులే చేయం అనావాయితీగా వస్తోంది.

### బోనం.. నైవేద్యం..

బోనం అన్నంలో పాలు, బెల్లంతో పరామాన్నం వండుతారు. కాకరకాయ, చిక్కుడుకాయ, వంకాయ, గుమ్మడి కాయ అన్ని కలిపి వండి పచ్చి పులుసుతో నైవేద్యం సమర్పిస్తారు. ఆలయంలో స్వామి వారికి ఉదయం బాల బోగం, మధ్యాహ్నం మహా నైవేద్యం, సాయంత్రం ప్రదోశకాల బోగం సమర్పిస్తారు.

### బండారి పసుపు.. గజ్జెల లాగు..

తెలుపు బొట్టు విభూది పెట్టుకున్న వారితో మరణం ఉండకూడదని మణిమల్లాసురులనే రాక్షసులు బ్రహ్మతో వరం పొందారు. ఆదే రాక్షసులను సంహరించేందుకు పసుపు (బండారి) బొట్టు, గజ్జెల లాగు తొడిగి జాలి ముసుగు వేసుకొని కొరడా, త్రిశూలం, ధమురకంతో వచ్చి మల్లికార్జునస్వామి రాక్షసులను సంహరించడాని భక్తుల విశ్వాసం. భక్తులు పసుపును కిలోల కొద్ది తీసుకవచ్చి స్వామివారికి సమర్పించి వెంట కొంత తీసుకెళ్తారు. ఒగ్గు పూజారుల కథల్లో మల్లన్నకు - మంగోలియా దేశానికి పసుపు సంబంధం కనిపిస్తుంది.

### శివసత్తులు.. శివసతులు..

జాతరలో ఎటు చూసినా శివసత్తుల పూనకాలే కనిపిస్తాయి. శివసతులే శివసత్తులుగా పిలువబడుతున్నారు. శివుడికి నాట్యం అంటే ఇష్టం మహిళలు శివుడిని కల్యాణం చేసుకునే సంప్రదాయం పూర్వ కాలం నుంచి వస్తోంది. అందులో భాగంగానే పునకాల నడుమ నృత్యాలు చేస్తారు. పురుషులు మహిళా వేషాధారణలో తన్మయం చెందుతారు.

### కొడే కట్టుట.. టెంకాయ బంధనం

శివుడి వాహనం కొడే(నంది) కోరికలు తీరితే కోడెను కడతారు. పెళ్లి కాని వారు, సంతాన లేమి, తదితర సమస్యలు ఉత్పన్నమైనప్పుడు మొక్కుబడి టెంకాయ బంధనం చేస్తారు. కొబ్బరికాయ, పసుపు, కుంకుమ, జాకెట్ ముక్క ముడుపు కట్టుతారు. కోరికలు తీరాక ముడుపు విప్పి మొక్కుబడిని చెల్లిస్తారు. ఇది తరతరాలుగా వస్తున్న భక్తుల నమ్మకం సంప్రదాయం. ఒడి బియ్యం పసుపు, నూనెతో కలిపి పోకచెక్కలు, ఖర్జూర పండ్లు, ఇద్దరు అమ్మవార్లకు చీరలు, జాకెట్ ముక్కలు, గాజులు పెట్టుతారు. స్వామి వారికి దోతి, తువ్వాల సమర్పిస్తు ఒడి బియ్యం పోసి మొక్కు తీర్చుకుంటారు. రాణి రుద్రమదేవి సైతం తన కూతురు ముమ్మడమ్మకు సంతానప్రాప్తి కోసం ఐదు రోజులు ఇక్కడే ఉండి మొక్కుకున్నట్లు చరిత్ర ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి.

### గండ దీపం.. శేవాలు..

గండాలు తీరితే గండదీపం పెడతారు. తలపై దీపం పెట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తారు. పిల్ల, జెల్ల చల్లగా ఉంటే శేవాలు తీస్తామని మొక్కుకున్న వారు తలనీలాలు సమర్పిస్తారు. ఆలయంలో మల్లన్న స్వామి పుట్టమన్ను రూపంలోనే కొలువయ్యాడు. మల్లికార్జునస్వామిని ఇలవేల్పు దైవంగా భావించే యాదవులు, కుర్మలు, ఇలవేల్పులుగా కొలిచే మరిన్ని కులాల వారు జాతరకు ముందు పుట్టమన్నుతో ఇంట్లో మల్లన్న గద్దెలు నిర్మించుకొని రోజు సాయంత్రం ఇళ్లలో డోలు మోగిస్తారు. నెలపట్టులు సస్తేడు (ఏడు) వారాలు పండుగను జరుపుకుంటారు. ఇళ్లలో డోలు మోగించి నెల రోజుల పాటు భక్తిపారవశ్యంతో మాంసాహారం, మద్యానికి దూరంగా ఉంటూ జాతరకు వచ్చి దర్శనం చేసుకుంటారు. పాలు, పెరుగు బయటికి ఇవ్వకుండా నేతిని చేసి స్వామి వారికి దీపంగా సమర్పిస్తారు.

### నృత్యమండపంలో సల్లవడ్డనం

బండారిని పూసుకున్న భక్తులు కాకతీయుల నృత్య మండపంలో కొరడాల మధ్య శివనాట్యం చేసి మల్లన్నను స్మరిస్తూ సల్ల కవ్వం (మజ్జిగ) చేసి స్వీకరిస్తారు. దీనిని చూడటానికి భక్తులు వేలసంఖ్యలో హాజరవుతారు. శివసత్తుల నృత్యాలు మండపాన్ని మారుమోగించగా పసుపుమయవుతుంది.

### సంక్రాంతికే ప్రభల జాతర

సంక్రాంతి వరకు మొదటి పంట పండి రెండో పంట రైతు ఇంటికి చేరుకుంటాయి. ధాన్యం దిగుబడులు పెరుగాలని పశుసంపద వృద్ధి చెందాలని ప్రభల బండ్లలను (ఎద్దుల బండ్లు) సుందరంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయడం అనవాయితీగా వస్తోంది. మార్నేని వంశీయులు పెద్ద రథంను (శిడి) అందంగా ముస్తాబుచేసి గ్రామంలోని పురవీధుల గుండా మహాని వేదనను ఆలయానికి తీసుకవస్తారు. దీనిని అనుసరించి వివిధ గ్రామాల నుంచి వచ్చే బంతిపూల బండ్లు తిరుగుతాయి. సాయంత్రం నుంచి తెల్లవారేవరకు శోభ సంతరించుకుంటుంది. దీనిని బట్టే జానపదుల జాతరగా పిలుబడుతుందని ప్రచారంలో ఉంది.

### జాతర, వారాలు

ఐలోని జాతరకు సంబంధించి డిసెంబరు 17న ఆదివారం రోజున స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సర మార్గశిర శుద్ధ పంచమిన దృష్టికుంభం ప్రారంభమైంది. ఆపై జాతర మకర సంక్రమణంతో ప్రారంభమై ఉగాది వరకు కొనసాగుతుంది. ఈ నెల 13న ధ్వజారోహణముతో ఉత్సవాలు ప్రారంభమై 14న భోగి పండుగ 15న మకర సంక్రాంతి ఈ రెండు రోజుల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. తర్వాత ఉగాది వరకు ప్రతీ ఆది, బుధ వారం వారంతపు జాతర సాగుతుంది. మొత్తం 11 వారాల జాతరకు లక్షల భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి దైవ దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకుంటారు.



కొత్తకొండలో తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీఎం శ్రీకాంత్

## కొత్తకొండ జాతరకు ప్రతీరోజు 20 ఆర్టీసీ బస్సులు

భీమదేవరపల్లి, జనవరి 11: కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కొత్తకొండ జాతరకు ప్రతీరోజు హుజూరాబాద్ నుంచి 80 ట్రిప్పుల ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. గురువారం కొత్తకొండ జాతరలో ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్‌ను పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు హుజూరాబాద్ డిపో నుంచి 20 బస్సులను రోజు 80 ట్రిప్పులు నడపనున్నట్లు తెలిపారు. పెద్దలకు రూ.60, చిన్నారులకు రూ.30 టికెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులను హుజూరాబాద్ నుంచి వయా మాణిక్యాపూర్, ముల్కనూర్, కొత్తకొండకు ప్రయాణికులను చేరవేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళా ప్రయాణికులకు ఉచితంగా జాతరకు చేరవేస్తామన్నారు. అనంతరం కొత్తకొండ శ్రీవీరభద్రస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జి ఉప్పుల భద్రయ్య, సర్పంచ్ దూడల ప్రమీల-సంపత్, ఆర్టీసీ డ్రైవర్ దూడల ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేయూలో బట్టల పంపిణీ



బట్టలను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

కేయూ క్యాంపస్, జనవరి 11: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల విభాగంలో ప్రతీ ఏడాది బోధనేతర ఉద్యోగులకు వర్సిటీ అందజేసే ఉచిత బట్టలను (డ్రెస్ కోడ్)ను గురువారం కేయూ పరీక్షల విభాగంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు, కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉద్యోగులకు అందచేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది ఉద్యోగులకు డ్రెస్‌లను అందచేస్తామని, విధుల్లో ఉన్నప్పుడు డ్రెస్ కోడ్ పాటించాలని సూచించారు. డ్రెస్‌తో వర్క్ కల్చర్‌తో పెరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లికేషన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.నరసింహారావు, ఎఫ్ఓ తోట రాజయ్య, కేయూ టెక్నికల్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, ఎ.నందయ్య, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ షకూర్, పోలేపాక కోర్నేల్, మల్లికాంబు, మజార్ అలీ, విజయ్,ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రీ వీఐపీ పాస్‌ల రద్దు

భీమదేవరపల్లి, జనవరి 11: కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయ ఆదాయం పెంచేందుకు ఫ్రీ వీఐపీ పాస్‌ల జారీని రద్దు చేసినట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. ఇక వీఐపీ పాస్‌లను రూ. 200 ధర పెట్టి కొనుగోలు చేయాల్సిందేనని ఈవో గురువారం విలేకరులతో తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వారం కిందట దేవాదాయ, వివిధ శాఖలాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో ఎడాపెడా వీఐపీ పాస్‌లు జారీ చేస్తున్నారని పలువురు పేర్కొన్నారు. దీంతో వీఐపీ పాస్‌లు రద్దు చేయాలని మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. ఒక్కో వీఐపీ పాస్‌ను రూ.200కు జారీ చేయాలని ఈవోకు సూచించారు. అంతేకాకుండా వీఐపీ పాస్‌లను రూ.1.50 లక్షలు పెట్టి తమ పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా కొనుగోలు చేశారు.

### ఐనవోలు జాతరలోనూ..

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరలో ఈ సారి వీఐపీ పాసులు రద్దు అయ్యాయి. వాటి స్థానంలో వీవీఐపీ టికెట్లను జారీ చేస్తున్నారు. ఒక్కో టికెట్ ధర రూ.500కు ఖరారు చేశారు. దీనికోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. యేటా జాతర సందర్భంగా వీఐపీ పాస్‌లు ఇచ్చేవారు. ఒక్కో పాస్‌పై రూ.500 తీసుకొని రశీదు ఇచ్చేవారు. ఒక పాస్‌పై ఐదుగురు దర్శనానికి వెళ్లేవారు. కిందటేడు వీఐపీ పాసులపై రూ.2.50 లక్షల ఆదాయం సమకూరింది. అయితే వీఐపీ పాస్‌లు రాజకీయంగా పక్కదారి పడుతున్నాయని విమర్శలు వచ్చాయి. దీనిపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వీఐపీ పాస్‌లు జారీ చేయవద్దని సూచిస్తు తాను టిక్కెట్ కొనుగోలు చేసి క్యూలైన్లో వస్తానని చెప్పడంతో పాస్‌లను ముద్రించలేదు. యేటా పలువురు తమ బంధువులు, స్నేహితులు, తెలిసినవారు వేలాదిమందిని వీఐపీ క్యూలైన్లో దర్శనాలు చేయించేవారు దీంతో ఈసారి ఆ పద్ధతికి చెక్‌పెట్టడంతో ఆదాయం పెరుగనుంది. ఆలయంలో స్వామి వారి దర్శనాలు, ధర్మదర్శనం(ఉచితం), శీఘ్ర దర్శనం టిక్కెటు ధర (రూ.50), విశిష్ట దర్శనం టిక్కెటు ధర (రూ.100), వీవీఐపీ టిక్కెటు ధర (రూ.500) ఖరారు చేసినట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రామగల్ల పరమేశ్వర్

## వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించాలి

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత డాక్టర్ రామగల్ల పరమేశ్వర్

వడ్డెపల్లి, జనవరి 11: వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా తనను ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత, మాజీ ఎంపీపీ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత సామాజిక వర్గానికి చెందిన తాను డాక్టర్‌గా, కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా చేసిన సేవలను గుర్తించి లోక్‌సభ సీటును కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 1996 నుంచి 2001 వరకు చేర్యాల ఎంపీపీగా, జిల్లా డీఆర్‌డీఏ బాడీ సభ్యుడిగా, వరంగల్ గ్రంథాలయ శాఖ డైరెక్టర్‌గా కాకుండా.. జిల్లాలోని అనేక నియోజక వర్గాల ఇన్‌చార్జిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించానని చెప్పారు. 2009 జనరల్ ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ మహాకూటమి అభ్యర్థిగా, 2014లో వరంగల్ లోక్‌సభకు మహాకూటమి అభ్యర్థిగా పోటీ చేశానని చెప్పారు. అపారమైన రాజకీయ అనుభవం ఉన్న తనకు వరంగల్ లోక్‌సభ స్థానాన్ని కేటాయించి సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నేతలు ఉడమల బాల్‌రెడ్డి, మంచాల చిరంజీవి, గోగికార్ కృష్ణకుమార్, ఉప్పుల రాములు, గౌరవేని శివకుమార్, ముస్త్యాల జార్జి తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ నేత నారాయణను కలిసిన లెనిన్



నారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లెనిన్

సుబేదారి, జనవరి11: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులను హైదరాబాద్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో గురువారం జర్నలిస్టు నాయకుడు బీఆర్ లెనిన్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇండియా కూటమి వరంగల్ పార్లమెంట్‌అభ్యర్థిగా తన పేరును పరిశీలించాలని ఈ సందర్భంగా లెనిన్ విజ్ఞప్తి చేశారు. లెనిన్ వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

### వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలి

హనుమకొండ రూరల్: వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని హనుమకొండ గోపాల్‌పూర్ ప్రాంతానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు జన్ను మొగిలి గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం శాలువతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జన్ను మొగిలి మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీలో సుమారు 26 యేళ్లుగా పనిచేస్తూ, జిల్లాలోని అన్ని సామాజిక వర్గాలతో సత్సంబంధాలు కలిసి ఉన్నట్లు పేర్కొన్నారు. వరంగల్ ఎంపీగా బీజేపీ తరుపున పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

## గోపాల్‌పూర్ చెరువులో గుడిసెల కూల్చివేత

**ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఎం నేతల డిమాండ్**



గుడిసెవాసులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

వడ్డెపల్లి, జనవరి 11: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌పరిధిలోని గోపాల్‌పూర్ చెరువులో పేదలు వేసుకున్న గుడిసెలను జిల్లా యంత్రాంగం గురువారం తెల్లవారు జామున కూల్చివేసింది. రెవెన్యూ, నీటిపారుదల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పోలీసుల ఆధ్వర్యంలో చెరువులోని గుడిసెలను కూల్చివేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గోపాల్‌పూర్ చెరువు శిఖం సర్వే నంబర్ 89లో సుమారు 20 ఎకరాల పైచిలుకు భూమి ఉంది. రెండేళ్ల కిందట సీపీఎం ఆధ్వర్యంలో ఇల్లులేని పేదలు చెరువు శిఖంలోని స్థలాన్ని చదును చేసి అక్కడే గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున రెవెన్యూ, నీటి పారుదల శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పోలీసులతో ఎక్స్‌కావేటర్‌తో గుడిసెలను నేలమట్టం చేశారు. గుడిసెలను ప్రభుత్వ యంత్రాంగం తొలగించడంతో గుడిసెలు వేసుకున్న పేదలు నిరాశ్రయులయ్యారు. పేదలు ప్రభుత్వ స్థలంలో వేసుకున్న గుడిసెలను తొలగించడం దుర్మార్గమని సీపీఎం నేతలు తేలూరి ఉప్పలయ్య, వాంకుడోతు వీరన్న, కూస రాజేష్‌లు ఆరోపించారు. జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా పునరాలోచన చేసి పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

### కలెక్టరేట్ ఎదుట ధర్నా

సుబేదారి: గోపాలపురం చెరువు శిఖంలో 2 యేళ్ల నుంచి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు సంబంధించిన గుడిసెలను కూల్చడాన్ని నిరసిస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి పెద్ద సంఖ్యలో గుడిసెవాసులతో సీపీఎం నాయకులు ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ.. అర్ధరాత్రి మునిసిపల్ సిబ్బంది పోలీసుల సహాయంతో గుడిసెలు తొలగించడం సరైంది కాదన్నారు. అనంతరం గుడిసెవాసుల డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని సీపీఎం నాయకులు కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సారంపెల్లి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. చుక్కయ్య, జిల్లా కమిటీ సభ్యులు వీరన్న, వెంకట్, తిరుపతి, కిశోర్‌తోపాటు గుడిసెవాసులు పాల్గొన్నారు.

## ఈనెల 13న ఆర్ట్స్ కాలేజీ మైదానంలో కైట్ ఫెస్టివల్

హనుమకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 13న శనివారం సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కైట్ ఫెస్టివల్ (పతంగుల పండుగ)ను నిర్వహించనున్నారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ కైట్ ఫెస్టివల్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుంది. సంక్రాంతి పర్వదినాన గ్రామాల్లో, పట్టణాల్లో పిల్లలు, పెద్దలు రంగు రంగల పతంగులను ఎగురవేయడం ఆనవాయితీ. ప్రాచీనకాలంగా వస్తున్న సంప్రదాయం. యాంత్రిక జీవనం వల్ల పతంగులను ఎగురవేయడం ఇటీవల కాలంలో చాలా తగ్గింది. పట్టణీకరణ వల్ల మైదాన ప్రాంతాలు కనుమరుగై పతంగులు స్వేచ్ఛగా ఎగురవేసే పరిస్థితులు కూడా లేకుండా పోయాయి.

ఈ పరిస్థితుల నేపథ్యంలో నగరవాసులకు పతంగుల ఎగురవేతలో ఉన్న ఆనందాన్ని మరోసారి కలుగచేసేందుకు ఈ కైట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. గతంలో 2017లో నగరంలో జాతీయ స్థాయి కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించింది తెలిసిందే. కలెక్టర్ పమేలా సత్పత్తి హయాంలో 2019లో కూడా ఒకసారి రాష్ట్ర స్థాయి పతంగుల పండుగను ఇదే ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు సంక్రాంతికి ఒక రోజు ముందు శనివారం కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు.



ఎంజీఎంలో ఆందోళన చేస్తున్న నర్సులు

## నర్సులను దూషించిన స్వీపర్‌పై చర్యలు తీసుకోవాలి

**ఎంజీఎంలో విధులు బహిష్కరించి నర్సుల ఆందోళన**

హనుమకొండ అర్బన్, జనవరి11: సేవే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న నర్సులను అకారణంగా దూషించిన స్వీపర్ రాజమ్మపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నర్సులు ఆందోళన చేపట్టారు. గురువారం మధ్యాహ్నం విధులు బహిష్కరించి పరిపాలన విభాగం ఎదుట ధర్నా, ఆందోళన చేశారు. రోగులు చికిత్స పొందుతున్న వార్డులో పారిశుధ్య చర్యలు నిర్వహించకపోవడంతో సంబంధిత వార్డు హెడ్ నర్సు పద్మలత విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజమ్మ అనే మహిళా ఉద్యోగి హెడ్‌నర్సుపై దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడింది. అంతేకాకుండా ఎంజీఎంలో విధులు నిర్వహిస్తున్న నర్సులందరినీ ఉద్దేశించడంతో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. నర్సుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన స్వీపర్‌ను విధుల నుంచి తొలగించే వరకు విధులకు హాజరు కాకుండా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని, విధులకు హాజరు కావాలని సూపరింటెండెంట్ కోరడంతో నర్సులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో వివిధ విభాగాల నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'అగ్రంపహాడ్'కు భారీ బందోబస్తు

### ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్



జాతర రోడ్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ఆత్మకూరు, జనవరి 11: రాష్ట్రంలో రెండో అతిపెద్దజాతరైన అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. గురువారం ఆత్మకూరు మండలంలోని అగ్రంపహాడ్‌లో సమ్మక్క-సారాలమ్మలను ఆయన సందర్శించారు. ఆ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వరంగల్, దుగ్గంపేట, ఆత్మకూరు నుంచి అలాగే చౌళ్లపల్లి ద్వారా వచ్చే రోడ్డు పెద్దాపురం నుంచి జాతరకు వచ్చే రోడ్లను డీసీపీ పరిశీలించారు. జాతర చుట్టూ రెండు కిలోమీటర్ల వరకు పంటలు వేయవద్దని పోలీసు అధికారులు స్థానికులకు సూచించారు. గతంలో కంటే ఈసారి భారీగా భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. స్థానిక మాజీ ఎంపీటీసీ బోరిగం స్వామిని పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. జాతర చుట్టూ పోలీస్ పెట్రోలింగ్‌తో పాటు మఫ్టీలో స్పెషల్ పార్టీ పోలీసుల నిఘా ఉంటుందన్నారు. జాతరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పటిష్ఠమైన భద్రత చేసి క్షణాలలో పోలీసులు చేరకునేవిధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ రవిరాజు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## రేపు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కాళోజీ జంక్షన్, జనవరి 11: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ పాలక వర్గ సభ్యుడు చెన్నమనేని జయశ్రీ తెలిపారు. ఈ ముగ్గుల పోటీలు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఉంటాయని ఆమె తెలిపారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు మొదటి బహుమతి రూ.2016, రెండో బహుమతి రూ.1,116, మూడో బహుమతి రూ.516లు ఉంటాయని సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్ తెలిపారు. ప్రోత్సాహక బహుమతులతోపాటు పోటీల్లో పాల్గొన్న వారందరికీ గిఫ్టులు అందజేస్తామని ఆయన తెలిపారు. పోటీల్లో పాల్గొనే మహిళలు సెల్ నంబర్లు 83673 56765 / 83670 56765 లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. లేకుంటే ఇక్కడికి వచ్చాన నమోదు చేసుకోవచ్చన్నారు.

# మైనార్టీ సంక్షేమశాఖ అధికారిపై విచారణ జరిపించాలి

**● తెలంగాణ మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నదీమ్‌ఖాన్**

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 11 : జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి శ్రీనివాసరావు విధుల్లో చేరిన నాటి నుంచి విచారణ జరిపించాలని తెలంగాణ ముస్లిం మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నదీమ్‌ఖాన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం లోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో గురువారం సంఘం ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారిగా శ్రీనివాస్ రావు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో వివిధ ఔట్‌సోర్సింగ్ విభాగాల్లో చేప ట్టిన నియామకాల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అర్హులైన వారికి కాకుండా డబ్బులు తీసుకొని అనర్హులకు పోస్టులు ఇచ్చినట్లు స్పష్టమవు తుందన్నారు. అందుకు నిదర్శనం డోర్నకల్ మైనార్టీ గురుకుల


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నదీంఖాన్

ఒకేషనల్ జూనియర్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు నియామకంలోత్రిసభ్య కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థికి కాకుండా రూ. 2లక్షలు తీసుకొని మరొకరికి ఇవ్వడమేనన్నారు. జిల్లా అధికారిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో వివిధ ప్రజా, విద్యార్థి, కుల సం ఘాల మద్దతుతో ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నదీర్‌పాషా, అలీపాషా, సోహెల్, అజీమ్, నయిం, అబ్బాస్, సాబీర్ పాల్గొన్నారు.

**● మరలా పునరావృతమైతే సహించేదిలేదు..**

జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బోధనేతర సిబ్బంది నియామకాలను చేపడితే సహించేదిలేదని ముస్లిం జేఏసీ నాయకులు అహ్మద్‌ఖాన్, ఎమ్డీ మహమూద్, ఎమ్డీ జహీరుద్దీ న్, మహ్మద్ సలీం పేర్కొన్నారు.

జిల్లా మైనార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసరావును కలిసి ఆయనపై వచ్చి న ఆరోపణలపై వివరణ కోరినట్లు పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చ రించారు. ఇక నుంచి జిల్లా కలెక్టర్, పైఅధికారుల ఆదేశాల ప్రకారం విధులు నిర్వహిస్తానని జిల్లా మైనార్టీ అధికారి వివ రణ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

కేసముద్రం, జనవరి 11 : మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 కాలెండర్‌ను సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీరం జనార్దన్‌రెడ్డి, గోపాల శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో టెట్ నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి కక్కెర్ల వీరందర్, జిల్లా ఉపాధ్యక్షుడు కుర్న హరినాథ్, ఉమేశ్వర్, రౌతు లక్ష్మీనారాయణ, ఓదెలు, బిక్షపతి, గోలి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## కేసముద్రం విలేజి రెడ్డి సంఘం ఎన్నిక

కేసముద్రం, జనవరి 11 : కేసముద్రం విలేజిరెడ్డి సంఘం నూతన కమిటీని ఎన్నికల అధికారులు పొదిల వెంకట్‌రెడ్డి, పొలెపల్లి వెంకట్‌రెడ్డి సమక్షంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముదిరెడ్డి రఘోత్తంరెడ్డి, ఉపాధ్యక్షునిగా పొలెపల్లి చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కాంతాల వెంకట్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా జూలకంటి తిరుపతిరెడ్డి, కోశాధికారిగా సంకు శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా రావుల రాజేశ్వర్‌రెడ్డిను ఎన్నుకున్నారు.


రఘోత్తంరెడ్డి, వెంకట్‌రెడ్డి

## రిమాండ్‌కు తరలింపు

తొర్రూరు, జనవరి 11 : వివిధ కేసుల్లో నిందితులుగా ఉంటూ గత కొంతకాలంగా తప్పించుకుని తిరుగుతున్న ఐదుగురు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. వివిధ కేసుల్లో ఉన్న వీరు కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో గురువారం పోలీసుస్టేషన్‌లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అరెస్టు చేసి వారిపై నాన్‌బెయిలబుల్ వారంట్ ఇష్యూ చేసి కోర్టుకు తరలించడం జరిగిందని తెలిపారు.

## బీఆర్ఎస్‌కు రాజీనామా అవాస్తవం

**● ఎంపీటీసీ భర్త చెక్కల శ్రీను**

చిన్నగూడూరు, జనవరి 11 : గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవ్వరు పార్టీకి రాజీనామా చేయలేదని, స్థానిక జడ్పీటీసీ పార్టీ మీటింగ్ అని చెప్పి తన స్వలాభం కోసం రాజీనామా చేసి తమను మోసం చేశారని ఆరోపించారు. గురువారం గుండంరాజుపల్లిలో ఎంపీటీసీ నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాన్ని అభివృద్ధి చేసింది మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అని, గ్రామ బీఆర్ఎస్ నాయకులంతా ఆయన నాయకత్వంలోనే పార్టీ కోసం పని చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, ఉప్పలయ్య, శ్రీశైలం, వెంకన్న, వెంకటేష్, క్రిష్ణ, సోమయ్య, వెంకటాద్రి, సంజీవ, కార్యకర్తలు ఉన్నారు.

# ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

తొర్రూరు, జనవరి 11 : తెలంగాణ రాష్ట్రంలో హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేకత ఉంటుందని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఓ ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకల్లో పాల్గొని ముగ్గులు వేశారు. పట్టణంలోని పురవీధుల్లో అలంకరించిన ఎడ్లబండిలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డితో కలిసి సంబరాలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని, ముందుగా నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను వేరు వేరుగా నిర్వహించుకుని మన సాంప్రదాయాలను గుర్తు చేసుకుంటూ పిల్లలకు రేగుపండ్లు పోస్తూ, బొమ్మల కొలువు చేసి, కనుమ రోజు ఎడ్లను, బండ్లను అలంకరించి పందాలు నిర్వహించుకోవడం, గ్రామాల్లో ప్రజలు ఉత్సాహంగా గడపడం ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమరాజశేఖర్, పెదగాని సోమయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.


క్యాంపు కార్యాలయం వద్ద ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

# ‘లయన్స్’ ఆధ్వర్యంలో నేత్రాల సేకరణ


పారిజాతం నేత్రాలను సేకరిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 11 : మహబూబాబాద్ పట్టణంలోని అడ్వకేట్స్ కాలనీలో గుండెపోటుతో మృతి చెందిన బోనగిరి పారిజాతం నేత్రాలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం సేకరించారు. ఆమె భర్త వెంకటేశ్వర్లు, కుమారులు ప్రసాద్, సుధీర్, సాయితరుణ్ అనుమతితో లయన్స్‌క్లబ్ మానుకోటశాఖ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టూట్యూట్‌కు పంపించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అడ్మినిస్ట్రేటర్ అనుమాల వెంకటేశ్వర్లు మాట్లాడుత ఒకరి నేత్రాల ద్వారా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చని, ప్రతీ ఒక్కరు నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ బాధ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మాలె కాశీనాథ్, పల్లబోతుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# ‘విద్యార్థులు ప్రతిభను పెంచుకోవాలి’

తొర్రూరు, జనవరి 11 : విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో ప్రతిభను పెంచుకోవాలని వాసవీక్లబ్ తొర్రూరు అధ్యక్షుడు బిజ్జాల అనిల్‌కుమార్, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రాజసుకన్య అన్నారు. గురువారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తొర్రూరులోని ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి ముగ్గుల, పతంగుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేదవిద్యార్థులకు క్లబ్ సహకారంతో మరిన్ని సేవాకార్యక్రమాలు చేపడతామన్నారు. సిద్ధార్థ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులచే వేషధారణ, ముగ్గులపోటీలు, పతంగుల పోటీలు చేపట్టారు. పాఠశాల కరస్పాండెంట్ ముత్తినేని జయప్రకాశ్, వాసవీ క్లబ్ కార్యదర్శి సీహెచ్.రాము, సేవా తరుణి అధ్యక్షురాలు దారం గాయత్రీ, కార్యదర్శి మాడుగుల జ్యోతి, నిఖిల్, అఖిల్, క్లబ్‌సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్ట పర్చండి

**● జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్**

మహబూబాబాద్ టౌన్, జనవరి 11 : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ధ్వంసమైన విద్యావ్యవస్థను పటిష్ట పర్చాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖను రాసి, స్థానిక హెడ్‌పోస్టాఫీసు నుంచి గురువారం పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులు తక్కువగా ఉన్నారనే కారణంతో అనేక ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూసి వేసిన పాఠశాలలను తెరిచి విద్యావ్యవస్థనుబలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పిండ్రాల రాందాసు, బాలరాజు పాల్గొన్నారు.

## ‘బేటీ బచావో-బేటీ పడావో’పై అవగాహన

ఇనుగుర్తి, జనవరి 11 : ఇనుగుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా మహిళా సాధికారత ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళ సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టు నలమాస అరుణ మాటాడారు. విద్యార్థినుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీయడానికి ఈ కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. బాలికల హక్కులు ఎలా సద్వినియోగం చేసుకోవాలో అబ్బాయిలతో సమానంగా అమ్మాయిల కూడా చూడాలని అవగాహన కల్పించారు. ప్రతి వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాల నిర్మూలనపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. సంధ్యారాణి, రాకేష్, సుగుణ పాల్గొన్నారు.

## ‘దళితబంధు’ను విడుదల చేయాలి

కేసముద్రం, జనవరి 11 : దళిబంధు పథకంలో ఎంపికైన లబ్ధిదారులకు నిధులను విడుదల చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ చెరుకు బాబుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో తమను పథకానికి ఎంపిక చేశారని, నేటికి డబ్బులు రావడంలేదని తెలిపారు. మిట్టగడుపుల మహేందర్, మందుల కృష్ణమూర్తి, వేల్పుగొండ ఏలియా, మంద మహేష్, ప్రవీణ్, జల్లంపల్లి శ్రీకాంత్, సుధాకర్, పందుల వీరన్న, లింగాడపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల ధర్నా

కేసముద్రం, జనవరి 11 : కేసముద్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఇళ్లస్థలాల లబ్ధిదారులు తమకు స్థలాన్ని అప్పగించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. కార్యాలయం ఎదుట కేసముద్రం స్టేషన్, విలేజి, కాలనీకి చెందిన పలువురు లబ్ధిదారులుబైఠాయించి, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కేసముద్రం పరిధిలోని సర్వే నెంబరు 399లో 75 గజాల చొప్పున 43 మందికి పట్టాలు ఇచ్చారని, రెండు నెలలుగా తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు భూమిని అప్పగించడంలేదని తెలిపారు. సర్వే చేసేందుకు అధికారులు రాకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సర్వే నిర్వహించి, భూమి తమకు అప్పగించాలని కోరారు. ఈ ధర్నాలో అబ్బగోని నాగన్న, కొలిపాక ప్రవసిత్, డొనికల రాజు, బోడ విజేందర్, ఎస్‌కె.నజీర్, బానోత్ శివ, మంచెల ప్రసాద్,

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన గాయత్రి గ్రానైట్స్ అధినేత


నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్

ఇనుగుర్తి, జనవరి 11 : గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఇనుగుర్తిలో గురువారం గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖఃసంతోషాలతో ఉండాలన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మండల ప్రజలకు సంక్రాంతి పండుగ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మలిశెట్టి శోభన్, బొల్లు సంపత్ పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ను కలిసిన రాంబాబునాయక్

గూడూరు, జనవరి 11 : కరీంనగర్‌లో గురువారం బీజేపీ జాతీయ కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌ను మహబూబాబాద్ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు రాంబాబునాయక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బండి సంజయ్‌కు పుష్పగుచ్ఛంఅందించి శాలువాతో సత్కరించారు. జిల్లాలో బీజేపీని బలోపేతం చేయాలని ఆయన సూచించినట్లు రాంబాబు తెలిపారు.


బండి సంజయ్‌తో రాంబాబునాయక్

## అమనగల్‌లో ముగ్గుల పోటీలు

మహబూబాబాద్ రూరల్, జనవరి 11 : అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. హెచ్ఎం వెంకటరెడ్డి ఉపాధ్యాయులు వెంకన్న, జనార్దన్, శశిధర్, బలాజీ, యుగేందర్, రామాచారి, అరుణ, కవిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

గూడూరు, జనవరి 11 : ప్రభుత్వ నియమనిబంధనలు అతిక్రమించి అధిక ఫీజు (చార్జీలు) వసూళ్లకు పాల్పడుతున్న ఆధార్, మీసేవ కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర నాయకులు మొగిలిచర్ల సందీప్ ప్రభుత్వాన్ని కోరారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన నిర్వహించి, సిబ్బందికి వినతిపత్రం అందించారు. మండలంలో మరో నాలుగు ఆధార్, మీసేవ కేంద్రాలకు మంజూరు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్‌కుమార్, శోభన్, దినేష్, రాజు, సునీల్, తరుణ్, పాల్గొన్నారు.

## కార్యకర్తలను కాపాడుకుంటా

**● డాక్టర్ నెమురుగొమ్మల సుధాకర్‌రావు**

పెద్దవంగర, జనవరి 11 : నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమురుగొమ్మల సుధాకర్ రావు అన్నారు. మండలంలోని పోచారం కూకట్ల సోమక్క ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో గురువారం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముత్తినేని శ్రీనివాస్, కూకట్ల వీరన్న, బాలునాయక్, శ్రీను, సారయ్య, శంకర్‌నాయక్, సతీష్, మల్లేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# బయ్యారం కాంగ్రెస్ నేతల ఘర్షణ


మండల అధ్యక్షుడు ముసలయ్యతో వాగ్వాదానికి దిగిన ఓ వర్గం కాంగ్రెస్ నాయకులు

బయ్యారం, జనవరి 11 : బయ్యారంలో గురువారం కాంగ్రెస్ నేతలు వర్గాలుగా చీలి, బాహాబాహీకి దిగారు. ముందుగా స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాల ముసలయ్య పలువురు నేతలతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మరి కొందరు నేతలు ప్రవీణ్‌నాయక్, శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, రామునాయక్, భాస్కర్, సురేష్ తదితరులు అక్కడికి చేరుకొని తమకెందుకు సమాచారం ఇవ్వలేదని, అసలు విలేకర్ల సమావేశం ఎందుకు ఏర్పాటు చేశావు అని అంటూ ముసలయ్యతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే నేతలు ఇరు వర్గీయులుగా చీలి బాహాబాహీకి దిగారు. ఒకరిపై మరొకరు ఆరోపణలకు పాల్పడటంతో ఘర్షణ వాతావరణం కాస్తా ఉద్రిక్తంగా మారింది. ఒకదశలో కొట్లాటకు దారితీస్తుందా..! అన్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై ఉపేందర్ తన సిబ్బందితో వచ్చి సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

**పీఏసీఎస్ చైర్మన్‌కు కాంగ్రెస్‌తో సంబంధం లేదు..**

బయ్యారం : బయ్యారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్ మూల మధుకర్ రెడ్డితో కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాల ముసలయ్య స్పష్టం చేశారు. బయ్యారంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన మధుకర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరకుండా గతంలో ఎమ్మెల్యే కనకయ్యతో ఉన్న రాజకీయ అనుబంధంతో ప్రస్తుతం బయ్యారంలో పెత్తనం చెలాయించాలని చూస్తున్నాడని ఆరోపించారు. జిల్లా కాంగ్రెస్ ఆదేశానుసారం మండల కాంగ్రెస్ నిర్ణయం మేరకు మధుకర్ రెడ్డితో కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు సనప సోమేష్, తమ్మిశెట్టి కుమారి, సర్పంచులు కోటమ్మ, వెంకటేశ్వర్లు, నాయకులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, బత్తిని రాంమూర్తి, రాసమల్ల నాగేశ్వరరావు, ముల్కూరి వీరారెడ్డి, తగిర సత్తిరెడ్డి, భూక్య రవినాయక్, పగడాల శ్రీనివాస్ తమ్మిశెట్టి వెంకటపతి, లింగయ్య పాల్గొన్నారు.


రామా శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పద్మశాలీలు

## రామా శ్రీనివాస్‌కు నివాళులు

కొత్తగూడ, జనవరి 11 : ప్రముఖ పారిశ్రామిక వేత్త, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘంవ్యవస్థాపక అధ్యక్షుడు, స్వచ్ఛంద సేవ సంస్థల వ్యవస్థాపకుడు రామా శ్రీనివాస్ మృతి బాధకరమని పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు కుసుమ రాజన్‌బాబు పేర్కొన్నారు. కొత్తగూడలో గురువారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మశాలీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి శ్రీనివాస్, కోశాధికారి దేవుళ్లపల్లి రాజు, ఉపాధ్యక్షుడు సామల రమేష్, సహాయ కార్యదర్శి తాటి శ్రీనివాస్, కోడం మహేందర్, సాదుల సాంబయ్య, తుల వెంకటనారాయణ, దేవుళ్లపల్లి రాజేశ్వర్, దేవుళ్లపల్లి మంగన్న పాల్గొన్నారు.

## టీఎస్ టీడబ్ల్యూటీయూ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

కొత్తగూడ, జనవరి 11 : తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం(టీఎస్‌టీడబ్ల్యూటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు వజ్జ సురేందర్‌ను వేలుబెల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు. వేలుబెల్లి పాఠశాలలో చదువుకుని రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన వజ్జ సురేందర్‌కు ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ వెంకటలక్ష్మి, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ రాజు, హెచ్ఎం దివ్య, ఉపాధ్యాయులు జయసుధ, రాంచందర్, కృష్ణమూర్తి, ప్రమీల, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థుల స్నాక్స్‌కు రూ.12 వేలు అందజేత

సీరోలు, జనవరి 11 : మండలంలోని కాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల సాయంత్రం స్టడీ అవర్ స్నాక్స్ కోసం కాంపల్లి ఉద్యోగుల సంఘం సహకారంతో సమకూర్చిన రూ. 12 వేలను సంఘం కన్వీనర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు బొందిలి వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు తోట రమేష్ ఇంచార్జి హెచ్ఎం శ్రీలతకు అందజేశారు. స్థానిక పాఠశాలలో గురువారం వారుమాట్లాడుతూ రాబోయే పదో తరగతి వార్షిక పరీక్షలకు 80మంది విద్యార్థినీ, విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. వారు ప్రతి రోజు ఉదయం గంట, సాయంత్రం గంట స్టడీ అవర్స్‌తోపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని, వారికి స్నాక్స్, బిస్కట్స్ అందించేందుకు ఆర్థిక సాయాన్ని హెచ్ఎంకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఏమైనా సందేహాలుంటే స్టడీ అవర్స్‌లో ఉన్న ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలకు హాజరై ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, వజ్రకుమారి, శాంతకుమారి, సోమేశ్వర్‌కుమార్, రమేష్, విష్ణు, ప్రశాంతి, సంధ్య, సరిత పాల్గొన్నారు.

## తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

నెల్లికుదురు, జనవరి 11 : తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఎర్రబెల్లిగూడెంలో గురువారం రాత్రి జరిగింది .స్థానికుల కథనం ప్రకారం పొదిల సాయిమల్లు (55) వృత్తి పనిలో భాగంగా గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కాడు ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సారమ్మ ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ బొమ్మెర అశోక్, గీత కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు.

## ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలి

**● కేటీఆర్‌కు జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి**

తొర్రూరు, జనవరి11 : వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరుతూ జిల్లా ఫ్లోర్‌లీడర్, మండల జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన వరంగల్ పార్లమెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ముఖ్య నాయకుల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ స్థానానికి మాదిగ సామాజిక వర్గానికి చెందిన తనకు పోటీచేసే అవకాశం కల్పించాలని కోరారు. ఈ విషయమై పార్టీ విధివిధానాలకు లోబడి పనిచేసే కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని అధిష్ఠానం ఆదేశాల మేరకు అవకాశాలు ఉంటాయని కేటీఆర్ తెలిపారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

డోర్నకల్, జనవరి 11 : మండలంలోని రావిగూడెం, తోడేళ్లగూడెంలలో గురువారం ఎక్సైజ్ శాఖ అధికారులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పంచదార, ఈస్ట్ బ్యాక్టీరియా మిశ్రమంతో కలిపి గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేసి 15 లీటర్ల నాటుసారాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇందుకు బాధ్యులైన రావిగూడెంకు చెందిన మంద వెంకన్న అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. టేకులతండాకు చెందిన మాలోతు చినబాబు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అతన్ని త్వరలోనే పట్టుకుని తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్సైజ్ సిబ్బంది రవి, శేఖర్, సత్యనారాయణ, వెంకన్న పాల్గొన్నారు.

## అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**● ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య**

గార్ల జనవరి 11 : రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని రేవంత్‌రెడ్డి ప్రజాప్రభుత్వంలో చేపట్టబోయో అభివృద్ధి పథకాలపై ప్రతిపక్షాలు విమర్శలు మానుకొని, నిర్మాణాత్మకమైన సూచనలు చేస్తూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. గురువారం గార్లలోని రైతు వేదిక భవనంలో 13 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.స్వాతిబిందు, ఎంపీడీవో రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, సర్పంచ్ అజ్మీరా బన్సీలాల్ వైస్ ఎంపీపీ కట్టబోయిన శ్రీనివాస్, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, ఎంపీటీసీలు వెంకట్‌లాల్‌నాయక్, పసుపులేటి సుజాత రామారావు, కాంగ్రెస్ నాయకులు యాకుబ్‌పాష, తాళ్లపల్లి కృష్ణగౌడ్, దనియాకుల రామారావు, భూక్యా నాగేశ్వరరావు, గుండా వెంకట్‌రెడ్డి, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

## కురవి పాఠశాలను తనిఖీ చేసిన ఆర్జేడీ

కురవి, జనవరి 11 : కురవి జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ‘ఉన్నతి’ కార్యక్రమంపై డైరీలు, రికార్డులు, బేస్‌లైన్ పరీక్ష పత్రాలు, ఎఫ్ఏ-3, ఎఫ్ఏ-4 పరీక్ష పేపర్‌లను పరిశీలించారు. అనంతరం పదో తరగతికి వెళ్లిన ఆర్జేడీ విద్యార్థుల మార్కుల రిజల్ట్‌ను పరిశీలించారు. తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతీ యూనిట్‌పై రివ్యూ బోధన, స్లిప్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. రానున్న పదో తరగతి వార్షిక ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వహీద్ పాల్గొన్నారు. ఆపై రాజోలు జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించారు.

## కమ్యూనిస్టులకు అండగా ఉండాలి

**● జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి**

కురవి, జనవరి 11 : నిరుపేదల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టులకు ప్రజలు అండగా ఉండాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. కురవిలోని పార్టీ కార్యాలయంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి, మాట్లాడారు. మండల కార్యదర్శి కర్నం రాజన్న, నెల్లూరి నాగేశ్వర్‌రావు, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, తురక రమేష్, రవి, కొంతం సత్యం, నిలుగొండ నాగేశ్వర్‌రావు, బొల్లం ఉప్పలయ్య పాల్గొన్నారు.